# మాధవీలత నవ్వింది

కథ వ్రాయడం అంటే మాటా? కథ అంటే మీ అమ్మమ్మో. నానమ్మో చెప్పే కాకమ్మ పిట్టమ్మ కథలనుకున్నావా? అది వ్రాయడానికి ఎంత ప్రేరకం కావాలి? అందుకే మైడియర్ ఎన్లైజర్! నాక్కావసిందేదో తొందరగా ఇచ్చేసుకో' అంటూన్న భర్తకేసి కళ్ళు మరింత పెద్దవిగా చేసి చూస్తూ.

అదేమిటండీ! భూప్రదక్షిణకంటూ బయలు దేరిన వెంకయ్య వున్న తావుకే వచ్చాడన్న కతగా, తమరి కథాయనమంతా నా నడుము చుట్టే తిరుగుతూంది' అంటున్న మాధవిని గట్టిగా అలుముకుని ముద్దుల వర్షం కురిపించాడు. చందర్.

అవును డియర్! కథ ఎక్కడో మిన్నులుపడ్డ తావునుంచి రాలదు. అది నీ పరిసరాల్లోంచి, నీవు పుట్టిన మట్టిలోంచి, నీవు ఆహర్నిశలు మెదిలే మనషుల్లోంచి పుడుతుంది. జీవితంలోంచి పొటమరిల్లిన కథ, ఆ జీవితమే కేంద్రంగా వృద్ధిని పొందుతూ, చివరకు ఆ జీవితానికే పాఠాలు చెబుతూ పరిసమాప్తి పొందుతుంది' అని చెప్పుకుపోతూన్న భర్త బిగి కౌగిలిని సడలించుకుంటూ, 'అంటే మీ కథ ఎదుటివారికి ఊపిరి సలుపనీయక ఉక్కిరిబిక్కిరి చేస్తుందన్నమాట!' అంటూ కిల కిల నవ్వింది.

భార్య ముఖాన్ని రెండు చేతుల్తో లేవనెత్తి కళ్ళమీదా పెదాలపైనా,చెక్కిళ్ళపైనా ముద్దులు దొంతరలు, దొంతర ముద్దులు గుమ్మరిస్తూ ఉద్రేకాన్ని పుంజుకున్నాడు చందర్.

తన్మయత్వంలోకి జారబోతున్న భర్తను బలవంతంగా జాగృతం చేస్తూ తెలివిగా బిగువైన బాహుపంజరపు బిగి నుండి యివతల పడేందుకు తానూ సంయమనాన్ని చిక్కబట్టుకుంటూ మాధవి -

'ఉండండి అవతల పాలు పొంగిపోతాయి. మీకు కమ్మటి వేడి వేడి టీ ఇస్తా'నంటూ వంటింట్లోకి పరుగెత్తింది.

చేజారి తప్పించుకుపోతూన్న కోడిపెట్టను తరుముకు వస్తున్న పుంజులా చందర్ మాధవి వెంబడే వంటింట్లో ప్రవేశించి -

'మధూ! ఏమిటి నీ బిహేవియర్? అనెడ్యుకేటెడ్ విలేజ్ గూఫీలా? ఆమాత్రం ఎదుటివాడి ఫీలింగ్స్ కూడా అర్థం చేసుకోలేని నీ ఎం. ఎ. లిటరేచర్ డిగ్రీ ఎందుకు? మంచి రసవత్తర ఘట్టంలో అనుభూతి ఫలాన్ని చెడగొట్టావ్ అన్నాడు చిరుకోపంగా.

'చందర్! ప్లీజ్, కాస్త తమాయించుకో. పాలు నిజంగానే పొంగిపోయేవి.'

'ఒహో, పాలు పొంగిపోతే కొంపలు కూలి పోయేవి. అవునా? తమరు మైలపడి పోయేవారు. నీవు చమత్కారంగా వంటింట్లో దూరితే నేను రాలేననా? అమ్మ దొంగా నిజమైన ఆడదానివి అనిపించుకున్నావ్' అంటూ రసకందాయంలో పడబోతూన్న భర్త శృంగార రసధునికి పరీవాహంలా సంభాషణాన్ని సంసారపక్షంగా మళ్లించాలనే ప్రయత్నంతో మాధవి చలాకీగా - 'టీ ఈజ్ రెడి సర్! మీరు చెప్పే కథ రుచిగా వుంటుందో నా టీ రుచిగా వుంటుందో మీరే తేల్చి చెప్పండి చూద్దాం' అంది.

ఆ మాటతో చందర్‌కు మళ్లీ కథా విశేషం తలపులను రాపిడి పెడ్తూవుంటే ప్రొద్దుటి ఎండలకు చిరుచెమటలు పోస్తూన్న భార్య ముఖంపై నర్తించే ముంగురులతో ఆడుకుంటూ-

'మాధవీ! టీ' రుచికీ కథా రుచికీ సంబంధం లేదు సుమా! టీ నోటి రుచికి సంబంధించింది, కథారుచి సాహితీ సంబంధమైన ఆనందానుభూతికి సంబంధించి నట్టిది. ఈ ఆనందం అమేయం, అనిర్వచనీయం సాటి చెప్పుకోవలసివస్తే నీ అధరామృతంతో పోల్చుకోవచ్చు. అంతే కానీ పాకకళకు సంబంధించిన రుచులతో పోలిక చెప్తానంటే ఈ మత్తులో కూడా నేను సహించను. మంచి కథ నవరసాలొలుకుతుంది. సరాగాలాడుతుంది. లాలిస్తుంది. అప్పుడప్పుడు కన్నెర్ర చేస్తుంది. మరోప్పుడు ఎడాపెడా పెట్లు పెడ్తూ బంతి కట్టి దుమ్మ దుమ్మ చేస్తుంది. ఇంకోప్పుడు నీవు ఇందాక నాటకం ఆడిన పాలపొంగులా పొంగినా అంచులు మించనీక కాగిన కమ్మటి మీగడపాలలా రుచులూరిస్తుంది' అన్నాడు.

'చందర్! నీవు వ్రాసే కథ ఎలా వుంటుందో కానీ కథ అంటే ఏమిటో రిసర్చ్ చేసి మరీ చెప్పినట్లుగా వుంది. 'కథాచరిత్ర' అంటూ ఓ పుస్తకం రాయరాదూ? స్థిరంగా వుండిపోతుంది. నలుగురు యువరచయితలు బాగుపడ్తారు' అంది మాధవి చిరునవ్వుతో.

'ఓ నా భార్యామణీ! బాగుపడేది యువరచయితలు అంటే కథకులు మాత్రమేనా? మీ ఆడరచయిత్రులు, అంటే అదే కథకురాండ్రకు అక్కరలేదా? మీ వారు సర్వజ్ఞులు కాబోలు! మరి మంచీ చెడ్డలకు వారు అతీతురాండ్రు అంతేనా?'

'గుమ్మడికాయల దొంగా అంటే భుజాలు తడుముకున్నట్టు, యువరచయితలు అనగానే మీకెందుకండీ అంత ఉలుకు? ఈనాడు మీతో అన్ని అవస్థల్లో మేం సమానంగా పాలుపంచుకుంటున్నాం అనేగా ఈ కన్నుకుట్టంతా'.

'మాధవీ! ఈర్ష్యాద్వేషాలు చేతగాని తనానికి ప్రతీకలు. యుగయుగాదులనుండి బుద్ధి వైభవం పురుషాధీనం. స్త్రీ కేవలం పురుషుడి మనోవికాసానికి ఆలంబనం. ఉద్దీపన కారణం. వాడి సాఫల్యసిద్ధికి ఉపకరణం. అంతేకాని ఆమెకు స్వయం పుష్టి ఏది? అది జన్మ సిద్ధమైన ధర్మం. ఏకాకిగా రమించలేని పురుషుడు తన్ను తాను రెండుగా విభజించుకున్నప్పుడు వామభాగం నుండి జన్మించింది స్త్రీ అనికదా నీ పురాణాలు చెబుతున్నాయ్. జన్మలోనే కుడీ ఎడమ లున్నాయి. జ్ఞాపకం వుంచుకో! అన్ని విధాలా అర్హతలున్న నాకెందుకు అసూయ? జాలి తప్ప'.

'చంద్రా! చూడు పురుషాధిష్ఠితమైన ఈ జగత్తులో పురుషుడు పన్నిన మాయ ఇది. కల్పించిన చమత్కార కథ. అందితే జుట్టూ అందకుంటే కాళ్ళు అనే తంతులో మీ మగవారు యుగయుగాలుగా మా శ్రమను దోచుకుంటున్నారు. మా సౌందర్యాన్ని అనుభవిస్తున్నారు. మా రాగరసాన్ని జుర్రుకుంటున్నారు. చివరకు మీ తోడిదే లోకంగా మలుచుకున్నారు. పసిపిల్లకు మిఠాయీలు పంచి మచ్చిక చేసుకున్నట్లు ఆడదానికి ఆభూషణాది అలంకారాలిచ్చి, అందమైన బొమ్మను అల్మారాలో భద్రపరిచినట్లు మా స్వేచ్ఛను నిరోధిస్తూ జోకొడ్తున్నారు. కటిక గుండెలకు జాలికూడానా? తెలుస్తూనే వుందిగా!' మాధవి గొంతులో వ్యంగ్యం ధ్వనించింది.

'అవును! మాకు జాలెక్కడిది? పగలు వొయ్యారాలు పన్నుతూ రాళ్లను కూడా కరిగిస్తూ వలపుల వడ్డికి సారించే మీ మాయలు కాదన్నానా? మాయల ఫకీరు బాలనాగమ్మను కర్రెకుక్కను చేసి వెంట తిప్పుకున్నట్లు. మీ మోహపాగురంలో చిక్కించుకుని ఎందరిని ఆడించలేదు. పాపం జూలియస్ సీజర్ అంతటివాడిని మీ క్లియోపాత్రా మహాతల్లి ఎన్ని పచాష్ట్లు చేయించిందో? అన్ని అనర్థాలకూ ఆడదే కారణం' అంటూ కొంటెగా నవ్వాడు చంద్ర.

ఆ మాటలు సహించలేని మాధవి రెండు చెవులు గట్టిగా మూసుకుంది.

'చందర్ ప్లీజ్, ఈ డైలాగ్ ఇంతటితో చాలించు సరసం విరసంగా మారే ప్రమాదం వుంది. ఇంత చదువూ సంస్కారం వున్న నీవు ఆడవాళ్లను ఇంత తక్కువగా అంచనా వేస్తూ చులకన చేస్తావనుకోలేదు.

నీ మగతనాన్ని మా బాగా ప్రదర్శించావ్. నిన్ను నమ్మి నీ ప్రేమ నిత్యమని నా సర్వస్వాన్నీ అర్పించినందుకు మంచి పాఠమే చెప్పావ్. ప్రేమ విలువ నీకు తెలియదు. తెలిస్తే ఇట్లా అవహేళన చేస్తావా? ఇందాక నాతో జరిపిన సరససల్లాపం అంతా కాముకమేనా? శారీరక సుఖం పంచడమే గొప్ప అనుకుంటున్నావా?' అంటూ వచ్చే కన్నీళ్లను ఆపుకునే ప్రయత్నం చేసింది మాధవి.

'మాధవీ! హోల్డాన్ ప్లీజ్! నిందమోపుతున్నావు. కాబట్టి వాస్తవానికి రాక తప్పదు. ఒక్కమాట. నీ పవిత్రప్రేమను అర్పించానంటున్నావ్, నిజంగా అర్పిస్తే మరి నీవూ, నేనూ అనే మాటలకు చోటేది? ఈ ఘోష వద్దు కానీ, పెళ్లి అంటే నిజంగా ఏమిటో చెప్పు?

మాటలు నేర్పిన చిలుకలా ఏడేడు జన్మల బంధం అగ్గిలో బుగ్గైనా తిరిగి లోకంలో ఒకరికోసం ఒకరు ఎదురు చూసే దాంపత్యం, పురుషుడు తిరిగి తాను పుత్రరూపంలో జన్మించేందుకు సాధనం అంటూ చెప్పే మాటలు ఒక్కక్షణం పక్కకు పెట్టు. అవన్నీ బాగా అలంకరించుకుని తెరకెక్కిన బొమ్మల్లాంటి సుభాషితాలు''.

'అయితే పెళ్లంటే నీ దృష్టిలో కేవలం సెక్స్. అంతేనా? పూర్తి దీర్ఘతముని తంతుగా కన్పిస్తున్నావ్' అంటూ కళ్లెర్ర చేసింది మాధవి.

'ఓహో! అయితే నాకన్నా ఈ విషయంలో రెండాకులు ఎక్కువే చదివావన్నమాట. ఆ దీర్ఘతముడెవ్వడో తరువాత చూద్దాం కానీ ఆహార నిద్రామైథునాలు జీవికి ప్రాథమికమైన లక్షణాలు. సర్వజంతు సామాన్యమైన ఈ ధర్మాన్ని విడిచి ప్రాణి బ్రతుకలేదు. అయినా జంతువుకన్నా మనిషి బుద్ధిచేత అధికుడు. అట్లాగే కాంక్షలూ ఎక్కువే! అందుకే సంస్కారి అయిన మానవుడు నియతానియత సంభోగాన్ని నియమిస్తూ పెండ్లి అనే ఒక నియమాన్ని ఏర్పరచుకున్నాడు. ఇదో సాంఘిక సదుపాయం. ఏ సోషియల్ సాంక్షన్, ఆర్ లైసెన్స్! నిజంగా చెప్పు. పెళ్లికి శారీరక సంబంధంతో నిమిత్తం లేదంటే, మరి పురుషుకిని పురుషత్వ ధర్మం లోపించినప్పుడు విడాకులెందుకు? ధర్మశృంగారం అంటే సంతానం కోసమైనా పురుష సంపర్కం అవసరం కదా! మరి ఆ మూల ధర్మాన్నే కాదంటున్నావే? నా ఫైనల్ స్టేట్‌మెంట్ విను. వివాహవ్యవస్థ, కుటుంబ వృద్ధికీ, ఆరోగ్యానికీ, అవసరానికీ పరస్పర రక్షణకూ ఏర్పడ్డ సదుపాయం. ప్రాథమికమైన అవసరపూర్తి తరువాతే సభ్యసమాజంలో నాగరికుడు తక్కిన విషయాలు ఆలోచిస్తాడు. అంతే కాని సెక్స్ ఈజ్ నథింగ్ అంటూ కొట్టిపారవేస్తే నేను ఒప్పుకోను' అన్నాడు చందర్.

ఈ మాటలు వింటున్న మాధవికి తాత్కాలికంగా ఆలోచనాశక్తి మందగించి, ఉక్రోషం ముంచుకొచ్చింది. పవిత్రమైన వివాహబంధంతో కట్టుబడి ప్రేమానురాగాలను పంచుతున్న తనకూ, తదితర స్త్రీకి తేడా చూడలేనివాడు తన భర్త అనే బాధ తీవ్రమైంది.

అందరిలానే పాశవిక తృప్తికి మాత్రమే అతడు తనను కోరుతున్నాడు. హృదయగతమైన ఆప్యాయతలు లేనివాడు, ఏ ఆడదానితోనైనా ఆనందంగా తనతోలానే అన్నీ అనుభవించగలడు అనే ఊహ కలగగానే, తన సర్వస్వాన్ని ఎవరో దొంగిలించినట్టయి, ఆ దొంగను తప్పక శిక్షించాలి అన్నంత ఊపుగా లేచి వెళ్లింది మాధవి. తన సామానంతా సర్దుకుని ఇంటి వెనుకకు వెళ్లి కూర్చుందామె.

మాధవి ఆ విధంగా డిస్కషన్ మధ్యలో లేచి వెళ్లడం చందర్‌కు తల తీసినట్లుగా వుంది.

ఇప్పుడు మాధవి తన కౌగిట్లో లేతవెన్నెల కాంతులను పులుముకునీ, చందన చర్చలతో ముఖమలు పట్టులాంటి మెత్తటి శరీరంతో, నునులేత బుగ్గలతో ఒదిగే భార్యగా లేదు. విద్యాగర్వంతో విర్రవీగుతున్న ప్రత్యర్థిలా వుంది.

తన ఆధిక్యాన్నీ, అనురాగాన్నీ లెక్క చేయకుండా పోటీకి దిగింది. పైగా మర్యాదలన్నీ మంట గలిపి ససేమిరా అంటూ తుర్రున వెళ్లింది. డామిట్ ఆడది 'వీక్' అంటూ ఎవడో మొద్దబ్బాయి అని వుంటాడు. అది, నన్నే కాదు నా తలలోని జేజమ్మను దింపుతుంది. నన్నెంత ఇన్‌సల్ట్ చేసి వెళ్లిందో చూడం. ఛీ, ఛీ ఆడదాని వగలు ఎప్పుడూ నమ్మకూడదనుకున్నాడు.

అయినా దెబ్బతిన్న పురుషుని అహం స్థిమితంగా వుండనివ్వడంలేదు. ఏమీ చేయలేకపోతున్నాడు. ప్రశాంతంగా వుండలేకపోతున్నాడు.

రెండేళ్లక్రితం ఓ సాయంకాలం మాధవి, తలలో మల్లెపూల గుభాళింపుతో తన భుజంపై ఒయ్యారంగా వాలుతూ, తన పెదాల మధ్యలో వున్న సిగరెట్‌ను తీసిపారవేసింది. అందుకు ప్రతిగా సకల సమ్మోహనాలనూ నింపుకున్న దొండపండువంటి పెదాలను మడిచిన తాంబూలంలా అందించింది.

నాటి బాస ప్రకారం తాకకుండా వదిలిన సగం ఖాళీ అయిన సిగరెట్ పెట్టెను తీసి చందర్ కసిగా ఓ సిగరెట్టు అంటించి, ఇదెవర్తి? నన్ను శాసించడానికి అంటూ నోట్లో పెట్టుకుని రెండు దమ్ములు పీల్చాడు.

అయినా అతనికి మనసు కుదుటపడలేదు. తన సార్వభౌమత్వాన్ని ఎవరో ప్రశ్నించారు. పైకి కనపడని పోలీసు దెబ్బల్లాంటి బాధ అది. మెత్తని పట్టుబట్టలో పెట్టి కొట్టిన చెప్పుదెబ్బ. నేనెంతో విశాల దృక్పథంతో సమాజపు గుడ్డి కట్టుబాట్లకు దూరంగా ఆడవాళ్లకూ సమానత్వాన్ని కల్పిస్తూ గౌరవిస్తే నన్ను పూచికపుల్లకు కొరగాకుండా తృణీకరిస్తూ లేచి వెళ్లింది.

ఇక సూర్యోదయం కాగానే మా ఊరెళ్తానంటూ నాటకం కట్టకపోతుందా? అబ్బో దాని గుండె దిటవు సామన్యమైంది కాదు. నాతో చెప్పవలసిన అవసరం దానికేముంది? చదువుందీ, వ్యవహారజ్ఞానం తెలుసు, అందుకే అన్నాడు భర్తృహరి అతి భయంకరాలైన వస్తు సారాన్ని పిండి స్త్రీగా చేశాడంటూ.

ఈ ఆలోచనాపరంపరలతో చందర్ బుర్రవేడెక్కింది. టీ.వీలో 'మైనే దిల్ దియా దర్ద్ లియా' అనే సీరియల్ వస్తూంది. అందులో దిల్ ఎక్కడుందో కానీ వారు చేసే ట్విస్టులకూ, ఊగే ఊపులకూ, తాకే తకులకూ శరీరం మాత్రం హానం కావచ్చు. చందర్‌కు కూడా ఆ వెకిలి శృంగారం ఏమాత్రం రుచించలేదు. వెంటనే వెళ్లి టీ.వీ ఆపుచేశాడు. ఈ అశాంతికి ఏదో ప్రతీకారం చేయాలి అంటూ ఆలోచనలో పడ్డాడు.

ఇంటి వెనక వున్న చిన్న స్థలంలో నాలుగైదు గులాబీ మొక్కలు, క్రోటన్లూ వున్నాయి. క్రోటన్లు మాధవికి నచ్చవు. కానీ చందర్ కంటికి కళాత్మకంగా వుంటాయి. అందుకే తన మొక్కలతో పాటు వీటికి నీటి తడుపులిచ్చి కాపాడుతుంది.

అన్నిటికన్నా మల్లెతీగలు మాధవికి చాలా ఇష్టం, పైగా ఆ మల్లె మామూలు మల్లెకాదు. దొంతి మల్లెలా పూరేకులు మూడు దొంతరల్లో వుంటాయి కానీ. పువ్వులు ముద్దల్లా వుండవు. పొడుగు మల్లెలా వుంటాయి. వాసన మాత్రం సంపెంగ వాసన. బహుశా అది సౌగంధికమేమో?

మల్లెపందిరి పక్కన ఓ ప్లాస్టిక్ నవారుమంచం, అందమైన దుప్పటి పరిచి వుంటుంది. ఆ పక్కనే ఓ చిన్న టేబుల్, కుర్చీ వుంటాయి. విశ్రాంతి వేళల్లో చందర్ ఆ కుర్చీలో కూర్చుని వ్రాసుకుంటాడు. మాధవి పొద్దుపోని పనులన్నీ చేస్తూ భర్తను విసిగిస్తూ రెచ్చగొడుతూ, ముచ్చట్లూ మురిపాలూ చూపుతూ వుంటుంది. సంసారసుఖం అంటే దీన్ని మించిందీ లేదు అనేంతటి తృప్తిని పంచే స్థలం అది.

మాధవి పందరి పక్క మంచంలో కూర్చుంది. వెన్నెల కళ్లను చెదిరిస్తూ శరీరాన్ని భగ్గున మండిస్తోంది. ఛీఛీ ఏమిటీ చలి అంటూ కొంగు ముసుగు పెట్టుకుంది.

నేనెంత మోసపోయాను? నన్ను నిలువునా దోచి పరిహసించాడే? నా అభిమానాన్ని సిగ్గునూ, సింగారాలను అన్నీ నిలువుదోపుగా ధారపోశానే? అంతటి పరిగ్రహాన్ని స్వీకరిస్తూ సెక్స్ అంటాడా? ప్రేమ కాదా? త్యాగం కాదా? దానం కాదా? ఆవేశంతో పెద్దగా అంది. తన మాటలు తనకే కొత్తగా వినిపించాయి. ఓ లిప్తకాలం ఆలోచించింది.

తనలోని వ్యక్తి చిన్నగా నవ్వుతూ మరోసారి ఆలోచించి చెప్పు అన్నట్లుంది. కొంత నిదానించే వరకు తాను దాతగా ధారపోశాను, ఇచ్చాను అన్నది పూర్తిగా వాస్తవం కాదేమో అనిపించింది. అందులో తనకు స్వార్థం వుంది. ఆ సుఖాన్ని తనూ పంచుకుంది. ఆ కౌగిలి వెచ్చదనంలో తన చందర్ గరుకు గడ్డపు రాపిడికి ఎరుపెక్కిన చెక్కిళ్ల చిరుమంటల్లో ఎంత హాయిని అనుభవించింది. ఎన్నెన్ని రహస్యపు మాటలు పలికింది. తలుచుకున్న కొద్ది మధురానుభూతులు పొందింది. ఈ సుఖానికి అంతటికి కారణం చందర్ అని మనసుకు తట్టగానే మరీ అతని మీద కసి ఎక్కువైంది.

తానేం చేస్తే ఆ అహంకారి నిజం తెలుపుకుంటాడు? ఏం చేస్తుంది? పుట్టింటికి వెళ్లిపోతుంది. ఛీ! అది తనకే అవమానకరం. కొత్తగా బుద్ధి చెప్పాలి అని మాధవి పథకం వేసుకుంటూన్న సమయంలో ఒక్క గాలికెరటం విచ్చిన మల్లెగంధాన్ని తెచ్చి నింపింది. ఆ సువాసనతో మృదువైన మనసులో ఏవో కోరికలు దోబూచులాడాయి.

మాధవి మళ్లీ ఆలోచించింది. తన అవగాహనలో ఏదో పొరపాటు దొర్లినట్లు ఫీలైంది.

అవునూ, ప్రేమానుబంధాలు గొప్పవే! ప్రేమ అమృతవర్షిణి. నిజమే! కానీ దానికి శారీరకమైన తర్పణంకూడా అవసరమే. కాకపోతే పరమపవిత్రం అంటూ భావించే నా శరీరంలోని ప్రతి అణువూ చందర్ సంపర్కాన్నీ, ఆ ఊర్పులోని వేడినీ, ఆస్పర్శలోని హాయినీ, ఆ చూపులోని ఆసక్తినీ ఎందుకు కాంక్షిస్తుంది?

సెక్స్ అంటే ఏదో దోషం అనుకుంటూ ఆ పదాన్ని అసహ్యించుకున్నాను. ఆమాట అంటే నాకు ఏవగింపు వుండవచ్చు. అది నా సంస్కారఫలం కానీ విషయం మాత్రం అంతే. ఇంతవరకూ జరిగింది అంతా ఉట్టి రభసేనన్నమాట. అయ్యో! పాపం అయన్ను వృధాగా అవమానించాను, అనుకుని సతమతమయింది.

ఇంట్లో చందర్ మరో సిగరెట్టు వెలిగించడానికి ప్రయత్నం చేస్తూ, గీచిన అగ్గిపుల్లని సిగరెట్టు అంటించకుండానే పారవేసి, 'పాపం మాధవి అన్నదాంట్లో తప్పేముంది? ఆమె నాకు ఏ సుఖాన్ని పంచలేదని నాకీ బాధా, పట్టింపు? వాదం సాగుతూ వుంటే మధ్యలో లేచిపోయిందనే కదా నన్ను చులకన చేసినట్లు ఫీలవుతున్నాను. అనవసరమైన అంగడిపెట్టక మెల్లగా తప్పించుకుంది. ఎంతైనా నెరజాణ.

అవునూ, ఆమెకూ కొన్ని నమ్మకాలుంటాయి. అలా వుండడమే మంచిది. నేనే ఉత్త చేమకూర చింతపండుని. కాకపోతే భర్తా, ధర్మం, నిస్వార్థ ప్రేమ అంటూ నమ్ముకొని నన్ను అన్ని విధాలా అలరిస్తున్న అందాల బరిణెను నా పిచ్చి వాగుడుకు తందాన కొట్టలేదని వెక్కిరిస్తానా? నిజానికి ఈ మగవారున్నారే పరమభోళాశంకరులు వెర్రివెంగళప్పలు.

ఆవేశంతో పిచ్చెక్కినట్లు పచ్చిపచ్చిగా వాగేది మగవాడు, గప్పుచుప్పున ఏమనకుండా సర్వోపచారాలు పొందేది స్త్రీ. ' ఒరే తిక్కసాన్యాసి! అందరి కళ్ళూ తెరిపించి విజ్ఞానాన్ని పంచుతానంటూ విరుచుకుపడి చాపకిందికి నీళ్లు తెచ్చుకోకు. అధికుడి చేతిలో కొంత రహస్యం గుప్తంగా వుండటం మంచిదన్నారు'. అనుకుని చందర్ మెల్లిగా ఇంటివెనక్కు నడిచి భార్యపక్కన చేరాడు. భయంభయంగా.

కాసేపటికి ధైర్యచేసి 'మధూ! బీ స్పోర్టివ్! నేనేమన్నానని? నీవన్నమాట కాదనలేదు. ఒక్క సవరణ! మ్యారేజ్‌లో సెక్స్‌ను కూడా చేర్చు' అంటూ దులపరిస్తూన్న మాధవిని గట్టిగా పెనవేసుకున్నాడు.

'అదేంకాదు పెళ్లంటే ద్విపదదాయకం. అదే ఇహపరం' అంటూ గున్నమామిడిని చుట్టుకున్న మాధవీలతలా చందర్‌ను మాధవి అల్లుకుంది.

మల్లెచెట్టు అపురూపంగా మరో సువాసనల కెరటాన్ని విసిరింది.

'పరమరమణీయమైన కథరా, మధూ! ఇది' అంటూ చందర్ పారవశ్యంలో మునిగాడు.